క్లుప్తంగా

రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): షెడ్యూల్ కులాలకు స్వేచ్ఛగా రాజ్యాధికారం చేసుకునే అవకాశం కోల్పోయారన్న విషయం చరిత్ర చెబుతుందని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మెండెం సంతోష్ కుమార్ అన్నారు. ఏలూరులో ఎస్ఆర్‌పీఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1932 సెప్టెంబర్ 24న పూణేలో ఎరవాడ జైల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మాగాంధీకి జరిగిన రిజర్వేషన్ల ఒప్పందమే ఈ పూన వడంబడిక అన్నారు. సమావేశంలో ఎన్ఏడీ పాల్, కొరబండ బాబురావు, స్వరూపు రాణి, కంచర్ల వాణి, పెరియార్ నాగరాజు, అప్పారావు, సురేష్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


అమృతం, డీఎంహెచ్ఓ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీజే అమృతం అన్నారు. స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి చాంబరులో బుధవారం నిర్వహించిన పీసీ – పీఎన్‌డీటీపై డీఏసీ సమావేశానికి అమృతం అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి పూర్తి స్థాయిలో నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఆడబిడ్డ జన్మించడానికి, ఎదగడానికి, చదవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడ, మగ అంతరాలు తొలిగేందుకు వైద్యాధికారులు ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో డీఎస్పీ బి.శ్రవణ్ కుమార్, గైనకాలజిస్టు లక్ష్మీకిరణ్, పిడియాట్రిషన్ సుజాతా దేవి, లీగల్ కన్సల్టెంట్ వడ్డే రవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెనర్జీ మృతికి సంతాపం


బెనర్జీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ, నాయకులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు మద్దాల ఫణి తండ్రి బెనర్జీ బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) సందర్శించి నివాళులర్పించారు. ఫణి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. జేపీ వెంట నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవి, మున్నుల జాన్ గురునాథ్, కాసామర్లపూడి జనార్ధన్, మందపాటి కిషోర్, సత్యనారాయణ ఉన్నారు.

కూర‘గాయాలు’

- పెరుగుతున్న ధరలు
- ఏలూరు నగర వాసుల గగ్గోలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగర వాసులకు కూరగాయల ధరలు గాయాలు చేస్తున్నాయి. రోజురోజుకీ ధరలు పెరుగుతూ కొనలేని పరిస్థితి తెస్తున్నాయి. పత్తేబాద, ఒన్‌టౌన్‌లలో ఉన్న రెండు రైతు బజార్లలోనూ ధరలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ధరలను నియంత్రించాల్సిన అధికారులు మిన్నకుండిపోతుండడంతో దళారులదే రాజ్యంగా మారింది. రైతు బజారుల్లో పేరుకు రైతులే ఉన్నా వారు పండించే పంటలు నేరుగా ఇక్కడ విక్రయించడం లేదు. దుకాణ నిర్వాహకుల్లో చాలా మంది విక్రయించే కూరగాయల్లో అనేక రకాల కూరగాయలు స్థానిక ఒన్‌టౌన్‌లో హోల్‌సేల్ మార్కెట్ నుంచే కొనుగోలు చేస్తున్నారనేది వాస్తవం. ఇక్కడ ధరలు బహిరంగ మార్కెట్‌లో పోల్చితే కిలోకు రూ.2 నుంచి రూ.4 వరకు మాత్రమే వ్యత్యాసం ఉంటుంది. రైతులు తమ పంటలను రైతు బజారుకు తీసుకువచ్చి విక్రయించే పరిస్థితి కనిపించడం లేదు.

ధరలకు రెక్కలు

కూటమి పాలనలో ఎండ, వానా కాలం అనే తేడా లేకుండా, వాతావరణ పరిస్థితులతో ప్రమేయం లేకుండా కూరగాయల ధరలు నిత్యం రెక్కలు తొడుగుతూనే ఉంటున్నాయి. రెండుమూడు రోజుల క్రితానికి, నేటి ధరలకు వ్యత్యాసం అధికంగానే ఉంటోంది. ఈ నెల 20న కిలో రూ.20 ఉన్న టమాటాలు నాలుగురోజుల్లోనే రూ.14 పెరిగి బుధవారం కిలో రూ.34కు విక్రయించారు. గత సోమవారం నాటు బీరకాయలు రూ.26 ఉండగా రెండు రోజుల్లో రూ.10 పెరిగి ప్రస్తుతం రూ.36కు చేరుకుంది. గత సోమవారం రూ.70 పలికిన బీన్స్ రైతు బజారు ఒక రోజు (మంగళవారం) సెలవు అనంతరం కిలో రూ.10 పెరిగి రూ.80గా బోర్డు పెట్టారు. గత 15వ తేదీ వరకు కొత్తిమీర కట్ట రూ.20 ఉండగా అక్కడి నుంచి సోమవారం వరకు రూ.25కు విక్రయించగా బుధవారం రూ.30కి పెంచారు.

కర్నూలు ఉల్లిని అంటగడుతున్నారు

ధరలు పతనమై విక్రయాలు లేక కర్నూలులో ఉల్లి అమ్మకాలు పూర్తిగా నిలిచిపోగా అక్కడి రైతులు రోడ్లపై ఉల్లిపాయలు పారబోసి వెళ్లిపోతున్నారని వార్తల్లో ప్రజలు వింటూనే ఉన్నారు. రెండు రోజుల క్రితమే తాడేపల్లిగూడెం ఉల్లిమార్కెట్‌లో ధరలు లేక అక్కడి వ్యాపారులు ఉల్లిపాయలను బస్తాలుగా రోడ్లపై పడేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే అలాంటి కుళ్లిపోయిన కర్నూలు ఉల్లిపాయలను రైతు బజారుల్లో వినియోగదారులకు బలవంతంగా అంటగడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైతులు రోడ్డుపక్కన వదిలేసి వెళ్లిన కర్నూలు ఉల్లిపాయలను రైతు బాజర్లకు తీసుకొచ్చి ఇక్కడి ప్రజలకు రూ.15కు బలవంతంగా విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా కుళ్లిన ఉల్లిపాయలను ఏరుకునే అవకాశం లేకుండా కొనుగోలు చేయాల్సిందే అని నిబంధన పెడుతున్నారు. రైతు బజారులో మరో రకం ఉల్లిపాయలు లేకుండా కర్నూలు ఉల్లినే అందుబాటులో ఉంచడంతో కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.


రైతు బజారులో కూరగాయల దుకాణం

ధరలను నియంత్రించాలి



గతంలో కూరగాయల ధరలు కిలో రూ.20 నుంచి రూ.30 మధ్య ఉండేవి. ప్రస్తుతం వీటి ధర రూ.30కి పైగా విక్రయిస్తున్నారు. ఈ ధరలతో కూరగాయలు కొనడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగానే ఉంటుంది. పెరుగుతున్న ధరలను నియంత్రించకపోతే సామాన్యుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోతుంది. అధికారులు తక్షణం ధరలను నియంత్రించాలి.

– కె.భారతి, గృహిణి

కుళ్లిపోని ఉల్లిని అందుబాటులో ఉంచండి



కర్నూలు ఉల్లి రైతులను ఆదుకోవడానికి ప్రజలు సిద్ధంగానే ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో కుళ్లిపోయి రోడ్లపై పడేస్తున్న ఉల్లిపాయలను ఇక్కడి రైతు బజారుల్లో విక్రయిస్తే ఎలా. ఉల్లిపాయలు కొని ఇంటికి తీసుకెళ్లి పడేసేలా ఉంటే డబ్బు వృథా కదా. కర్నూలు ఉల్లి ఏరుకునే అవకాశం కల్పిస్తే రైతులకు, ప్రజలకు ఊరట ఉంటుంది.

– జి.బాల శ్రీలక్ష్మి, గృహిణి

మానసిక ఆరోగ్యంపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గిరిబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఒత్తిడి రుగ్మతగా మారకముందే మేలుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్లినికల్ సైకాలజిస్ట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి ఎదుర్కోవడానికి విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. మానసిక వైద్య నిపుణులు హన్నా కోమలి మాట్లాడుతూ మానసిక రుగ్మతలను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం విజయకుమార్ సమన్వయం చేయగా, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వర రావు, వివిధ విభాగాల అధ్యాపకులు ఎం రాంబాబు, కె.రమేష్, ఎస్ పరమేశ, పీఆర్ కావ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు


పంపుల సెంటర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు


పత్తేబాద కనకదుర్గ


బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల మూడో రోజు బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు చేసి, అష్టోత్తర శతనామ పూజలు, విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాహనాల వేలం ఆదాయం రూ.10. 38 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో నిర్బంధ వాహనాలకు బుధవారం వేలం నిర్వహించారు. 7 గూడ్స్ క్యారియర్లు, 1 మ్యాక్సీ క్యాబ్, 1 కాంట్రాక్టు క్యారేజ్ బస్సు, 3 ఆటో రిక్షాలు, 1 ట్రాక్టర్, 1 ట్రైలర్ 6 మోటార్ సైకిల్స్‌ను రోడ్డువర్తి, స్క్రాప్ వేలం నిర్వహించగా రూ.10. 38 లక్షల ఆదాయం రవాణా శాఖకు లభించిందని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు.

బిడ్డకు తల్లిపాలు అమృతం


తల్లిపాల ప్రాముఖ్యతపై వివరిస్తున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు మొదటి టీకాలాంటిదని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని, ప్రతిబిడ్డకు పాలిచ్చేలా చూడాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. బుధవారం ఐకేపీ భవన్‌లో 8వ రాష్ట్రీయ పోషణమాసం–2025 కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి మాట్లాడారు. తల్లి పాలు ప్రాముఖ్యత గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసనం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

సర్వజనాసుపత్రిలో దోమల బెడద


ఏఆర్‌టీ సెంటర్ వద్ద మురుగు గుంట

ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి నీరు నిలిచిపోతుంది. నాచు పట్టి దోమలకు ఆవాసంగా మారింది. ఈ ఆసుపత్రిలో పారిశుధ్యం అంతంత మాత్రంగా ఉంది. ఆసుపత్రి మెయిన్ గేటు నుంచి ఆసుపత్రి చుట్టుపక్కల నీరు నిలిచిపోయి దోమలు ఉత్పత్తవుతున్నాయి. దోమలు రోగులను నిద్రిపోనివ్వడం లేదు. అసలే వర్షాకాలం జ్వరాలు వ్యాపించే సీజన్‌లో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని రోగుల బంధువులు విమర్శిస్తున్నారు.– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు


ఆసుపత్రిలో స్వాగతం పలుకుతున్న గోతులు


దోమలకు నిలయం


సిటీ స్కాన్ వార్డు వద్ద నాచు పట్టిన దృశ్యం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	38	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70–96
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జేడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	05
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	23
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	27

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు


ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, వైద్యులు

దెందులూరు: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్ చంద్ర, జి.కృష్ణ అన్నారు. బుధవారం చాటపర్రు పీహెచ్‌సీలో స్వస్త్ నారీ, స్వశక్తి పరివార్ పథకంలో భాగంగా 435 మందికి సాధారణ పరీక్షలు, 76 మంది మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. నాయకులు నాగరాజు, ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు, హెల్త్ ఎక్స్టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కృష్ణమోహన్, పీహెచ్ఎన్ మోహన్ బాయ్, ఏఎన్ఎంలు ఉన్నారు.

దోపిడీకి గురవుతున్న ప్రజలు

వేలేరుపాడు: సత్యశోధక్ సమాజ్ ఏర్పడి 152 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఏలూరు జిల్లా నాయకులు సిరికొండ రామారావు అధ్యక్షతన కుల నిర్మూలన, ఆచర్ణాత్మక కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్ పాల్గొని మాట్లాడు తూ మహాత్మ జ్యోతిరావు పూలే కుల వ్యవస్థ నిర్మూలనకు 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక సంస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రధాని మోదీ విధానాల కారణంగా ప్రజలు దోపిడీకి గురవుతున్నారని చెప్పారు.

బస్టాండ్‌లో ‘భౌ’బోయ్


వీధి కుక్కల మధ్య నుంచి వెళ్లేందుకు జంకుతున్న మహిళలు


ప్రయాణికులతో నిండిపోయిన కుర్చీలు


కుర్చీలు చాలక ప్లాట్‌ఫామ్‌పై కూర్చున్న యాత్రికులు

- వీధి కుక్కల సంచారం
- వాటిని చూసి భీతిల్లుతున్న యాత్రికులు
- వైరస్ సోకిన శునకాలతో భయం భయం
- శ్రీవారి క్షేత్రం బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల బస్టాండ్‌లో వీధి కుక్కలు యాత్రికులను హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా వైరస్ సోకిన శునకాలు వణుకు పుట్టిస్తున్నాయి. వాటిని దాటుకుని వెళ్లేందుకు యాత్రికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వం, బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ప్రయాణికులు ధ్వజమెతుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

శ్రీవారి దివ్య క్షేత్రానికి నిత్యం వేలాది మంది యాత్రికులు రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్నారు. అందులో అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ యాత్రికులకు సమస్యగా మారింది. వీధి కుక్కలు బస్టాండ్ లోనే తిరుగుతూ, అక్కడే పడుకుంటున్నాయి. యాత్రికులు వాటిని దాటుకుని వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బుధవారం వేలాది మంది భక్తులు శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్టాండ్‌లో పడుకున్న శునకాల మధ్యలోంచే వారు సంచరించాల్సి వచ్చింది. కొందరు మహిళలు, పిల్లలు అవి ఎక్కడ దాడి చేస్తాయోనని భీతిల్లారు. బిక్కుబిక్కుమంటూ అడుగులు ముందుకు వేశారు. ఇదేం బస్టాండ్‌రా.. దేవుడా అంటూ ఆ గోవిందుడికి దండం పెట్టుకున్నారు.

శునకాల వద్ద దుర్వాసన

శరీరమంతా పండ్లు, దుర్వాసనతో వైరస్ సోకిన శునకాలు ప్రయాణికుల మధ్య తిరుగుతున్నాయి. దీంతో వారు విస్తుపోతున్నారు. అవి కరిస్తే పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు. ప్రముఖ క్షేత్రంలోని బస్టాండ్ ఇంత దారుణంగా ఉంటే ఎలా అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్‌ఫామ్‌లే దిక్కు

ప్రస్తుతం బస్టాండ్‌లో ఉన్న కుర్చీలు యాత్రికులకు చాలడం లేదు. కొందరు ప్లాట్‌ఫామ్‌ల పైనే కుర్చుంటున్నారు. ఎక్కువ సేపు నిలబడలేని వృద్ధులు, మహిళలకు ప్లాట్‌ఫామ్‌లే దిక్కవుతున్నాయి. సరైన తాగునీరు కూడా లేదని పలువురు మండిపడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని యాత్రికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు వీధి కుక్కల బెడద తొలగించడంతో పాటు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని యాత్రికులు కోరుతున్నారు.


బస్టాండ్‌లో సంచరిస్తున్న వైరస్ సోకిన శునకం

మరీ ఇంత దారుణమా!



క్షేత్రంలోని బస్టాండ్‌లో పరిస్థితి మరీ ఇంత దారుణంగా ఉంటుందని అనుకోలేదు. పడుకున్న వీధి కుక్కల మధ్య లోంచి తిరగాల్సి వస్తోంది. అవి కరిస్తే పరిస్థితి ఏమిటి. కొన్ని కుక్కలకు వైరస్ ఉంది. వాటిని చూస్తుంటేనే కడుపులో తిప్పుతోంది. ఆర్టీసీ అధికారులకు ఇవి కనిపించవా.

– అంబటి గంగాధరరావు, నరసాపురం, యాత్రికుడు

సౌకర్యాలు కల్పించాలి



బస్టాండ్‌లో కుర్చీలు చాలక చాలామంది ప్లాట్‌ఫామ్‌లపై కుర్చున్నారు. సరైన తాగునీరు కూడా లేదు. ఇక్కడ బస్టాండ్‌లో ఇలాంటి పరిస్థితులు ఉండటం దారుణం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే చాలదు. సరైన సౌకర్యాలు కూడా కల్పించాలి. ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలి.

– పిట్టి కోటేశ్వరరావు, బాపట్ల, ప్రయాణికుడు